సిద్ధాంతాలకు లొంగని సత్యం

# ★ రావలసిన భావ విప్లవం ★

వి. శార్వరి

కథ రాయబోతున్న వాడినల్లా ఆగి తలెత్తి చూశాను. అర్థరాత్రి. పక్కనే మంచం మీద రాధ పడుకొనివుంది. జుట్టంతా రేగి నాచులాగా పరుచుకొనివుంది. మధ్యలో తెల్లగా కలువపువ్వుమల్లే రాధ ముఖం వెలుగుతోంది. గాఢనిద్రలో పైట తొలిగిందనే విషయం రాధకి తెలీదు పాపం! దీపం వెలుగుతూనే వుంది డ్రాయరుమీద. అట్లాంటి యౌవనాంగి ఆహ్వానిస్తూండగా ఈ తెల్లకాగితాలను నలుపుచేసే దౌర్భాగ్యమేమిటి? ఇప్పటికే నాకా రాధఅల్లరితో సరిపోతుంది. కథ రాయబోయేసరికి ఈ తద్దినం వొచ్చింది. ఎవరితడు? అర్థరాత్రి. తలుపులన్నీ బిగించాను నేను. ఎట్లా వొచ్చాడు? భార్యాభర్తల గదిలోకి - ఏకాంతంగా వున్నప్పుడు?

'ఎవరు నువ్వు?'

'నన్నే మర్చిపోయావట్రా! అవును. మర్చిపోక ఏంచేస్తావులే! ఇప్పుడు నాతో అవసరం తీరిందిగా! నన్ను జ్ఞాపకముంచుకో వలసిన బరువు కూడా లేదు మరి' అన్నాడు.

తలా తోకా లేని ఈ సంభాషణ నాకు తలనొప్పి ఎత్తించింది. అతను నా అనుమతి లేకుండానే పక్కనే వున్న కుర్చీలో కూచుని రాధకేసి చూస్తున్నాడు. నాకు మండిపోయింది. ఎవడీగాడిద? నా రాధవైపు... అవేం చూపులు వెధవ చూపులు. నేనులేచి రాధని సరిగ్గా పడుకోబెట్టి దుప్పటి నిండా కప్పి కొంతవరకు తృప్తిపడ్డాను.

'ఇదేనా? ఇదేనట్రా నీ సంస్కరణ? మళ్లీ పెద్దపెద్ద వ్యాసాలు రాస్తావే పత్రికల్లో. స్వేచ్ఛానురాగ సిద్ధాంతాన్ని కథల్లో పొగుడుతావుగా! నీ పెళ్లాన్ని... అని మరింత చక్కనిదయితే గోషాలో వుంచేవాడివనుకొంటాను; చూస్తున్నానని దుప్పటికప్పేశావా? ...ఛీఛీ... రాతల్లోవున్న గొప్పతనం జీవితంలో మీరెందుకు అందుకోలేరు! ఈ రచయితలున్నారే వీళ్లు రాసేంత గొప్పగా జీవితాన్ని అనుభవించలేరు. అంతా దొంగతనం. అబద్ధాలు.'

అందరి రచయితల తరఫునా తలొంచుకొన్నాను మనిషి డొక్కశుద్ధి ఉన్నవాడికిమల్లే కనిపించాడు. ఫ్లాస్కులోని 'టీ' రెండు కప్పుల్లో పోసి ఒకటి నేను తీసుకొన్నాను. టీ తాగుతూ అన్నాడు—

'నాలుగేళ్ళకిందట నేనూ యిల్లాగే ఫ్లాస్కుల్లో పోసుకుని టీ తాగేవాణ్ణి. నీ చలవవల్ల ఇట్లా అయ్యాను.'

అతన్ని నే నెక్కడో చూసినట్లు గుర్తు. రెండు మూడు గంటలు మాట్లాడినట్లుగాకూడా కొంచెం జ్ఞాపకం. అయితే పేరు తెలీదు. ఒకనాడు గొప్పగా జీవితాన్ని అనుభవించినవాడే నన్న విషయం అతని శరీరంలోని ఏ భాగం చూసినా తెలుస్తోంది. అతను నాకు పరిచితుడనే విషయం కాదనలేను. అయితే 'ఫలానా' అని స్పష్టంగా చెప్పలేను. అతని పతనానికి నేనే ఎట్లా కారణమో కూడా నాకు తెలీదు.

'ఎవరు నువ్వు?' మళ్లీ తొలి ప్రశ్న.

'అవును. జ్ఞాపకం వుండదు. ఆ స్టేజి దాటి పోయావు.'

'క్షమించండి. గుర్తించలేదు.'

'నా పేరు రావుసాహెబ్ ధర్మారావు.'

మెదడు గాలిస్తున్నాను.

'నీ కొడుకుని' అన్నాడు కిసుక్కున నవ్వి.

నాకూ నవ్వొచ్చింది. యాభై ఏళ్ళ ముసిలి డొక్కు అతను. ఇరవై మూడులో నడక నాది. రాధ కాపరానికొచ్చి నాలుగునెలలేనా కాలేదు. ఇతరత్రా ధర్మసంతానం విషయం అంటే పంకజానికి పుట్టింది ఆడపిల్ల అరుణ. ఇతను నా కొడుకుట. మనిషిలో హ్యూమర్ చావలేదింకా.

'నవ్వుతావేం? నీవు నా తండ్రివి. నేను నీ కొడుకుని. భయపడబోకురా నాయనా! నీ ఆస్థిలో భాగం పెట్టమని అడగన్లే అయితే ఎందుకొచ్చావంటావా? నీకు నా గతి చెప్ప డానికి. నీ తప్పులు చూపెట్టడానికి'

మొదటికీ యిప్పటికీ భేదం లేదు నాకు.

'తెలీలేదు కదూ? తెలీదురా తండ్రీ! తెలీదు. చెబుతా పట్టు. నేను నీ కొడుకుని; అంటే నీ కథలో పాత్రని. నాలుగు సంవత్సరాలకిందట నన్ను గురించి కథ రాశావు. నా పేరు రావు సాహెబ్ ధర్మారావు. నాకు నాలుగు మిల్లు లుండేవి. రెండొందల ఎకరాలు మాగాణి వుండేది. నాకి నాలుగంతస్తుల మేడ. మేడ మీది నుంచి కిందికి దిగను. సిల్కుల్లో మునుగు తుండేవాణ్ని. ఎయిర్ కండిషనర్ ఎప్పుడూ నాపక్కనే వుంటుంది. నాలుగు పెద్ద కార్లు నావి. ప్రజల్ని దోచుకునేవాణ్ని. కార్మికుల 'రక్తమాంసాలు' పీల్చేవాణ్ని. సమాజాన్ని 'దోపిడి' చేసేవాణ్ని. ప్రజలనుండి 'దొంగతనం' చేసిన డబ్బుతో నేను 'రావుసాహెబ్' నయ్యాను. ముందల మునాగోరుని. తాగుబో తుని. కూలీల కొంపలు తగలబెట్టించిన వాణ్ని.'

'నువ్వా! జ్ఞప్తికొచ్చింది నరరూప రాక్షసి! కథలో నాయకుడివి నువ్వేగదూ? అయితే యిదే మిటి? ఈ గోనె పట్టాలు, పుల్లు, పెరిగినజుట్టు, జోరీగలు...'

నవ్వాడు.

'ఇదంతా నీ చలవే.'

'ఏం చేశాను?'

'నా మూలంగానే సమాజం యిట్లా అవక తవగ్గా వుందని రాశావు. నా ఆస్థినంతా ప్రజల పరం చేస్తే సమాజం సుఖంగా వుంటుందని రాశావు.'

'అవును రాశాను. అట్లావుండటం మంచి దేగా?'

'మంచిదే! ఇదిగో యిదే మంచి.'

'ఏం?' అన్నాను అయోమయంగా. నా సిద్ధాంతంలో ఎక్కడ పొరబాటుపడ్డానో నాకు తెలీలేదు.

'నీమాటప్రకారం ఆస్థినంతా ప్రజల కిచ్చే శాను. పొలం కవులుదార్ల కిచ్చేశాను. డబ్బు పంచి పెట్టాను. మేడ పాతిక కార్మిక కుటుంబాల కిచ్చాను.'

'భేష్! యింకేం? యిప్పుడు వాళ్లంతా సుఖంగా జీవిస్తున్నారు గదూ!'

'అదిలేదు. అట్లాజరిగితే నేనూ సంతోషించి వుందును.'

'మరి...?'

'తొందరపడబోకు. చెబుతా పట్టు. నా మిల్లులు దానం గ్రహించినవాళ్లు సుఖంగా వ్యాపారం చేసుకొంటున్నారు. కవులుదార్లకు పొలం కొంచం ఎక్కువొచ్చింది నిజమే! అంతమాత్రాన వాళ్ల దరిద్రం పోలేదు. మరొక భూస్వామి పొలం కవులు చేస్తున్నారు. డబ్బు పంచితే తలకు నాలుగు రూపాయలు రాలేదు. పాతిక కుటుంబాల కార్మికులా మేడ నమ్ము కొని వొచ్చిన డబ్బుతో కొందరు పెళ్లి చేశారు. కొందరు చిన్నచిన్న వ్యాపారాలు చేసు కొన్నారు. నేను మాత్రం యిట్లా తయా రయ్యాను కూటికీ గుడ్డకూ మొఖం వాస్తూ.'

'అబద్ధం. నువ్వట్లా చెయ్యలేదు. దొంగమాట చెబుతున్నావు నాతో' అరిచాను బిగ్గరగా.

'అరవకోకు. అవతల శ్రీమతి లేస్తుంది. నేను చూస్తాను. ఖర్మం కాలక నేనామెను ప్రేమించినా ప్రేమించవొచ్చు. అదిగో! అప్పుడే మొఖం మట మట లాడిస్తున్నావు. పోస్తే ఆ గొడ వెందుగ్గాని... ఆఁ ఏమన్నావ్? అబద్ధమనిగదూ? కాదు. నిజం! నిజం! ముమ్మాటికీ నిజం!'

'అబద్ధం'

నీరసంగా నిట్టూర్చాడు.

'నే నొక్కణ్ణి ఆస్థి సంఘపరం చేసినంత మాత్రాన ప్రజాస్వామికం రాదు. అట్లా వొచ్చింది ప్రజాస్వామికం కాదు.'

'మరేమిటి?'

'పెట్టుబడిదారీ విధానంలో ఒక పరివర్తన. మార్పు చెందినట్లే కనిపిస్తుంది. కాని మార్పు చెందదు.'

'నా కంతా గొడవగావుంది.'

మరో కప్పు టీ తాగి చెప్పాడు:

'వ్యక్తిగతమైన పరివర్తన పరివర్తన కిందికి రాదు. మార్పనేది సంఘపరంగా జరగాలి.'

'సంఘమనేది వ్యక్తులసమూహం అయినపుడు వ్యక్తులు మారినప్పుడు సంఘం మాత్రం ఎందుకు మారదు?'

నేను మాట్లాడలేదు.

'నేనొక్కణ్ణి మిల్లు పెట్టనంతమాత్రాన, నేను వ్యాపారం చెయ్యనంతమాత్రాన, సామాజికు లందరూ నా మోస్తరుగానే వుంటారనే నమ్మక మేముంది? దోపిడీ చేసేవాళ్ళను నిందించడం కంటే, వాళ్ళ దోపిడీ చెయ్యడానికి ఏయే అవ కాశాలు ప్రోత్సాహ మిస్తున్నాయో వాటిని నిర్మూలించడానికి ప్రయత్నం చెయ్యడం జర గాలి. అప్పుడు దోపిడీగాళ్ళు తమంతట తామే దోపిడీ కార్యక్రమాన్నుండి బైటికొస్తారు.'

'తినమరిగిన కోళ్ళు యిళ్ళు దిగుతయ్యా?'

'దిగవు. దిగేటట్లు చెయ్యాలి'

'అయితే వ్యక్తులు మారితే లాభం లేదం టారు. వ్యక్తుల తత్వాలు మారాలంటారు. అవునా?'

'అవును'

'మారాలనడం సులభమే. కాని వాకంతట మారడం కష్టం...మార్పులు రావాలంటే ఏం చెయ్యాలి?'

'మీరు కావాలనుకొనేది ఏమార్పు?'

'వీటిల్లో మళ్లీ రకరకాలా ఏమిటి?'

'ఆర్థిక మార్పు, భావ మార్పు.'

'అన్నట్లు జ్ఞాపక మొచ్చింది. భావ విప్లవం కంటే ముందు ఆర్థిక విప్లవం రావాలని ఎక్కడో చదివినట్టు గుర్తు. ఎందుచేతంటే ఈనాటి ఆర్థిక విధానమే యిట్లాంటి భావా లుండడానికి కారణం. అయినప్పుడు వొక్క ఆర్థిక విప్లవాన్ని విజయం చేసుకొంటే దానివల్ల భావ విప్లవ విజయంకూడా లభించినట్లేగా?'

'దేనికైనా విలువలు తెలియాలి. తాగు బోతుకి వంద రూపాయి లిచ్చి దాచుకోమంటే సారాతో స్నానం చేస్తాడు. వాడికి వంద రూపాయల విలువ తెలియదు. కార్మికులకు నేను మేడ యిచ్చాను. అమ్ముకొని చెడతాగారు. ఆర్థికంగా అక్కడ మార్పు జరిగింది. కాని దాని ఫలిత మేమయింది? ఒట్టి ఆర్థిక విజయం నిండైన వ్యక్తిత్వాన్ని యివ్వలేదు.'

'కడుపులో పేగులు చుట్టలు చుట్టుకొంటే వాడికి కావలసింది తిండి. అదిలేకుండా నువ్వెన్ని శుష్కప్రియాలు చెప్పినా వాడువినడు. ఆకలి ఆకలితో మాడుతున్న వాడికి నీ 'ధర్మబోధ'లు చెవికెక్కుతాయంటే నమ్మలేక పోతున్నాను. ముందు కావలసింది తిండి.'

ఫక్కున నవ్వాడు.

'తిండికావాలి. నిజమే! తిండికావాలంటే ఈ పద్ధతుల్లో దొరకదు. సామాజిక విధానం మారాలి. విప్లవానికి ఈనాడు సంఘంలోవున్న భావాలు' పచ్చి వ్యతిరేకం. మానవుని జీవనం మానవుని చేతిలోనే వున్నదనే విషయం ప్రతిమానవుడికీ తెలియాలి. అప్పుడు ఏ అవసరంలేకుండానే వాళ్ళు తమ 'గతి'కి కారణాల కనుక్కోగలుగు తారు. ఆ ఫలితాలే వాళ్ళచాత విప్లవాన్ని జరి పించి విజయాన్ని సాధించి పెడతాయి. తన జీవితాన్ని, దేవుడు, కర్మాధీనం చేసినంత కాలం మానవుడు దేన్నీ సాధించలేడు. ఆ పారతంత్ర్యా న్నుండి అతను ముందు బైట పడాలి. పడేటట్లు చూడాలి.'

అతని మాటలువింటే నిజమేననిపించింది నాకు. హఠాత్తుగాజ్ఞాపకమొచ్చింది మధ్యలో, ఇతను ఏ 'యిస్టో'? అడిగాను.

'నువ్వు కమ్యూనిస్టువా?'

'కాదు'

'రాయిస్టువా?'

'కాదు'

'పోనీ సోషలిస్టువనుకొంటాను?'

'ఇదొక రోగం. నేను చెప్పేది నిజమైన ప్పుడు నే నే 'యిస్టు'నైతే నీకెందుకు? నాకు ఏదో వొక యిస్టు'ను అంటగట్టి, వొక, 'యిజం' అద్దంలోనించి నన్నెందుకు చూడబోతున్నావో అర్థంకావడం లేదు. లాభాలేమిటో చెప్పావు. వీటిని యిట్లాగే ఎందుకు స్వీకరించలేవు?' నా భావాలకు వొక 'యిస్టు' మేకప్ యిస్తేనేగాని నీకు బాగుండదుకదూ? యథార్థాన్ని యథా ర్థంగా చూసే తత్వం నీ కింకా రాలేదు.'

చప్పున కుర్చీమించి లేచి నాతో చెప్ప కుండానే వెళ్ళిపొయ్యాడు. ఏదో అడుగుదా మని పిలిచాను. నా పిలుపు తిరిగి నాదగ్గరికే వొచ్చింది.